క్లుప్తంగా

బోనస్ డబ్బులు విడుదల చేయాలి

కృష్ణా: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వరిధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సప్ప ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, రుణమాఫీ కూడా కేవలం కొంతమందికి ఇచ్చి మమ అనిపించారని ఆరోపించారు. ధాన్యం విక్రయించి మూడు, నాల్గు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు బోనస్ డబ్బులు అందించలేదన్నారు. ఈ విషయంపై త్వరలోనే పార్టీ అధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు.

గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

కోస్గి రూరల్: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అనునిత్యం కృషి చేయాలని కొడంగల్ నియోజకవర్గ బహుజన్ సమాజ్ పార్టీ ఇన్‌చార్జి ఇసువప్ప అన్నారు. ఆదివారం పట్టణంలోని గుడిదొడ్డిలో వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి సమీర్, పాలమూర్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, నారాయణపేట జిల్లా అ ధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎ న్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రకృష్ణ, ఉపాధ్యక్షుడిగా మహేష్, కోశాధికారిగా శివ, సహాయ కార్యదర్శిగా హరికృష్ణ, బహుజన వలంటరి ఫోర్స్ కన్వీనర్‌గా అభిషేక్‌లను ఎన్నుకున్నారు. అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, కాన్సీరాంల ఆలోచన విధానాలతో పని చేస్తూ బహుజన రాజ్యం రావడానికి నిరంతరం కష్టపడాలని కోరారు.

భగవద్గీత గ్రంథ ప్రచారం



నారాయణపేట రూరల్: మండలంలోని అప్పక్‌పల్లి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగేశ్వర్ స్వామి గురించి వివరించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, నాభ్యానాయక్, కృష్ణయ్య, తిరుపతయ్య, విష్ణు, వెంకటేష్, సత్యం, రజిత, దీపిక, రాధిక పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ బోనాలు



నర్వ: మండల కేంద్రంలో ఆదివారం కట్టమైసమ్మ, తాయమ్మ, కర్రెమ్మ, కెంచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి, బోనాలలో తీసుకొచ్చిన నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కోళ్లు, మేకలు, గొర్రెలను బలిచ్చారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ స్వాతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కెంచె భాస్కర్



ధన్వాడ: పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కెంచె భాస్కర్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని భక్తమార్కండేయస్వామి కమ్యూనిటీ హాల్లో నూతన పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలో కెంచె భాస్కర్‌ను కుల పెద్దలు ఎన్నుకున్నారు. వచ్చే రాఖీ పౌర్ణమి రోజు అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉదయభాను, ప్రస్తుత అధ్యక్షుడు బాలరాజు, రాష్ట్ర కార్యదర్శి శివాజీ, మాజీ అధ్యక్షుడు బాలప్ప, వెంకట్రాములు, వెంకటేష్, శ్రీనివాసులు, బాలరాజు, కృష్ణయ్య, సూరి, వీరేష్‌కుమార్ పాల్గొన్నారు.

'గోరింటాకు అందరి సంప్రదాయం'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గోరింటాకు పెట్టుకోవడం అన్ని మతాలకు సంప్రదాయంగా మారిందని వీరశైవ లింగాయత్ మహిళా నాయకురాలు నాగశ్రీ, బునేటి ఉషారాణి అన్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని ఆదివారం స్థానిక వీరన్నపేటలోని విశ్వలింగాయత్ కమ్యూనిటీ హాల్‌లో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు.

అంతా.. క్యూఆర్ మయం



దుకాణంలో క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లింపులు

- పట్టణం నుంచి పల్లెల దాకా వ్యాపించిన క్యూఆర్ కోడ్
- లావాదేవీలపై వ్యాపారులకు అవగాహన
- నగదు బదిలీ కోసం యాప్‌ల వినియోగం

కోస్గి రూరల్: గత ఆరేళ్ల క్రితం పెద్దనోట్లు రద్దు చేసిన కేంద్రం ఆర్థిక సంస్కరణలో భాగంగా నగదు రహిత లావాదేవీల మీద దృష్టి సారించింది. దీంతో బ్యాంకర్లు గ్రామస్థాయి నుంచి క్షేత్ర స్థాయిలో నగదు రహిత లావాదేవీల మీద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రారంభ దశలో ప్రజలు లావాదేవీలు చేసేందుకు ఇబ్బందులు పడినప్పటికీ ప్రస్తుతం పూర్తి స్థాయిలో నగదు రహిత లావాదేవీలకు అలవాటు పడ్డారు. ఏ దుకాణానికి వెళ్లినా క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు చేతిలో చిల్లి గవ్వ లేకపోయినా తమ వద్ద స్మార్ట్ ఫోన్‌తో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు అందరు ఎక్కడికి వెళ్లినా సరిపడా డబ్బులు తీసుకెళ్లేవారు. ఇంకా అవసరమైతే బ్యాంకుల్లో, ఏటీఎం సెంటర్లలో నగదు విత్‌డ్రా చేసుకొని వినియోగించుకునేవారు. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్‌ఫోన్లు, నగదు బదిలీల కోసం యాప్‌లు అందుబాటులోకి రావడం, నగదు రహిత లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్‌లు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి తోపుడు బండ్ల వద్ద నుంచి పెద్దపెద్ద వ్యాపారులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండటంతో రోజుకు రూపాయి నుంచి లక్ష వరకు యాప్‌ల ద్వారా నగదు రహిత ఆర్థిక లావాదేవీలు చేస్తున్నారు.

వివిధ యాప్‌లు..

ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత లావాదేవీలు చేసేందుకు స్మార్ట్‌ఫోన్‌లలో వివిధ రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్‌లలో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. కంపెనీ నిర్వాహకులు, వ్యాపారుల సౌకర్యార్థం దుకాణదారులకు సౌండ్ సిస్టమ్ వచ్చే విధంగా బాక్స్‌లు ఇస్తున్నారు. యాప్స్ నిర్వాహకులు రోజు వారి ట్రాన్స్‌జక్షన్స్‌ను బట్టి రుణాలు కూడా మంజూరు చేస్తుండడంతో వ్యాపారులు క్యూఆర్ కోడ్‌ల వినియోగం మీద ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో వ్యాపారులకు చిల్లర గొడవ తప్పినట్టయింది.

యాప్స్‌లో ఉపయోగాలు..

- నగదు కోసం బ్యాంకుల్లో గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండకుండా యాప్‌ల ద్వారా సులువైన పద్ధతిలో నగదు బదిలీ చేసుకోవచ్చు.
- యాప్‌లలో మొబైల్, డీటీహెచ్ రిచార్జి, ఎల్ఐసీ, విద్యుత్ బిల్లులు, లోన్ ఈఎంఐలను చెల్లించవచ్చు.
- బస్సు, రైల్వే, విమాన టికెట్లతో ప్రైవేటు బస్సుల బుక్ చేసుకోవచ్చు.
- యాప్‌ల్లో క్యూఆర్ కోడ్‌ల ద్వారా రోజువారి బదిలీలకు చరణంగా యాప్ నిర్వాహకులు లోన్ ఆఫర్లను అందిస్తున్నారు.

బ్యాంకులకు వెళ్లే పని తప్పింది..

గతంలో వస్త్రాలు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వేల రూపాయలతో వచ్చి నగదు చెల్లించి వస్తువులు కొనుగోలు చేసేవారు. కాని ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వినియోగదారులు ఫోన్‌లలోని క్యూఆర్ కోడ్‌ల ద్వారా సులువైన పద్ధతిలో నగదు రహిత లావాదేవీలు చేసి వస్తువులు కొనుగోలు చే స్తున్నారు. నగదు నేరుగా బ్యాంకులో జమ అవుతుండటం వల్ల మాకు రోజు వారిగా బ్యాంకులకు వెళ్లే పని తప్పింది.



– యెనుగుండ్ల నరేందర్, వ్యాపారి, కోస్గి

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట క్రైం: ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలకు రోడ్డు భద్రతానియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ బాలరాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వివిధ గ్రామాల నుంచి సంతకు వచ్చే సమయంలో ఇంట్లో ఒకరు తప్పకుండా ఉండేలా చూసుకోవాలని, బంగారు వస్తువులను బ్యాంక్ లాకర్‌లో దాచుకోవాలని సూచించారు. బ్యాంక్ ఖాతాల వివరాలు ఓటీపీలు, ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత సమాచారం ఇస్తే ఖాతాల్లో డబ్బులు కాజేస్తారన్నారు. సోషల్ మీడియా ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్, ఇమానిల్ పాల్గొన్నారు.

16న కాడిపీర్ల ఉత్సవాలు



నర్వ: ఈ నెల 16న లంకాల్ గ్రామంలో కొడిపీర్ల ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా 10 రోజుల పాటు నిర్వహించే ఈ చిన్నపీర్ల ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి సవారీ, గురువారం పగలు సవారీ ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలు అంత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

శాకాహారమే ఉత్తమ ఆహారం



ధన్వాడలో శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ సొసైటీ సభ్యులు

ధన్వాడ: మాంసాహారం కంటే శాకాహారం ఉత్తమ ఆహారమని నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ధన్వాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆకుకూరలు, పప్పు దినుసులు మాంసం కంటే ఎన్నోరెట్ల విటమిన్లు ప్రోటీన్లు అధికంగా ఉంటాయన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా నిస్వార్థమైన సేవను పిరమిడ్ సొసైటీ అందిస్తున్నదని వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ మాదవరెడ్డి, ధ్యాన శాకాహార ప్రచార కార్యదర్శులు ఆంజనేయరెడ్డి, మాధవిశైలజ, హరినాథ్, శ్రీనివాస్‌నాయుడు, అనురాధ, రేణుక, బాలరాజ్, సత్యనారాయణరెడ్డి, సరిత, పావని, జైపాల్‌రెడ్డి, హరినాథ్, నరసింహ పాల్గొన్నారు.

కోటతో అనుబంధం మరువలేనిది



నారాయణపేట రూరల్: ప్రముఖ తెలుగు చలన చిత్ర నటులు కోట శ్రీనివాస్ తో బాలు అభిమాన సంఘం ఉన్న అనుబంధం మరువ లేనిదని ఆయన మరణం తెలుగు చలనచిత్ర రంగానికి, కళాకారులకు తీరనిలోటని ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి అన్నారు. 2000 సంవత్సరంలో నారాయణపేట పట్టణంలో బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య, పాటల పోటీల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి కోట శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బాహుమతులను అందించారని చెప్పారు. కోట శ్రీనివాస్ రావు మృతి ఎంతో బాధ కలిగిస్తుందని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఒంటికి.. రెంటికీ కష్టాలే!

- మాగనూర్ జూనియర్ కళాశాలలో కరువైన మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు



మరుగదొడ్లు లేక ఆరుబయటకు వెళ్తున్న విద్యార్థులు

మాగనూర్: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో మురుగుదొడ్లు లేకపోవడంతో ఒంటికి, రెండికీ వెళ్లేందుకు విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాలురు అయితే పంట పొలాల్లోకి వెళ్తుండగా, విద్యార్థినులు, మహిళా అధ్యాపకుల కష్టాలు వర్ణనాతీతం. ప్రస్తుతం కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు సరిపడ మరుగుదొడ్లు లేకపోవడంతో పాటు ఉన్న రెండు, మూడు శిథిలావస్థకు చేరాయి. దీంతో విద్యార్థుల హాజరు శాతం తగ్గుతోంది. మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులును వివరణ కోరగా.. 14 ఏళ్ల నుంచి కళాశాలకు మెంటినెన్స్ ఖర్చులు రూ. రూ.10 వేల వరకు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. ఒక టాయిలెట్ బ్లాక్ మాత్రమే ఉండటంతో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు వినియోగించుకుంటున్నారు. అవి కూడా సరిపోవడం లేదు. బాలురు మాత్రం ఆరుబయటకే వెళ్తున్నారని సమాధానం ఇచ్చారు.

రెడ్డి సేవా సమితి అధ్యక్షుడిగా చీరల సుధాకర్‌రెడ్డి



ధన్వాడ: మండల రెడ్డి సేవాసమితి కార్యవర్గం ఎన్నికలు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరామారెడ్డి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, చిట్టెం మాధవరెడ్డి సారథ్యంలో ఆదివారం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా చీరల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దామోదర్ రెడ్డి, గో పాల్‌రెడ్డి, అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రఘువీరా, మనోహర్‌రెడ్డి, కోశాధికారిగా నాగిరెడ్డి, ఎన్నికయ్యారు. స లహాదారులుగా ఆర్ వెంకట్‌రెడ్డి, గూడూర్ సుదర్శన్‌రెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నారాయణపేట రూరల్/మరికల్: జెడ్పీహెచ్ఎస్‌లో విద్యనభ్యసించిన 1983–84 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

- నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2008– 2010 ఇంటర్ పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీలత, శోభారాణి, సతీష్ రెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.
- పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో 1999–2000 టెన్త్ క్లాస్ బ్యాచ్ 25 ఏళ్ల తర్వాత సిల్వర్ జూబ్లీ గెట్ టుగెదర్ నిర్వహించుకున్నారు. పాఠశాలకు 50 కుర్చీలు, స్టీల్ ప్లేట్స్ అందించారు.శాంతానంద పురోహిత్, రతన్ పాండురెడ్డి, సీతారాములు, శ్రీనివాస్, దత్తు, యాద య్య శెట్టి పాల్గొన్నారు.



పర్వతాపూరు.. భక్తులహోరు

నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో అడవి మొత్తం మారుమోగింది. ఆదివారం మండలంలోని పర్వాతాపూర్ మైసమ్మ ఆలయంలో జనం తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం పైగా ఆషాఢమాసం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని విందు బోజనాలు చేశారు. దీంతో అడవిలో చెట్ల కింద జనం జాతరలా కనిపించారు.

సైక్లింగ్ పోటీలు ప్రారంభం



మక్తల్‌లో సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి

మక్తల్: మక్తల్ పట్టణంలో ఆదివారం జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపికలు మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ప్రారంభించారు. సైక్లింగ్ ఎంపికలను జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలకు, బాలికల సైక్లింగ్ ఎంపికలను ప్రతి భ కనబర్చిన మహిళలను, బాలబాలికలను ఈనెల చివరి వారంలో ఇండియా సౌత్ జోన్ సైక్లిలింగ్ జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. 130 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. గార్లపల్లి రోడ్డు సమీపంలో ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, జిల్లా అధ్యక్షుడు తాన్‌సింగ్, జిల్లా కోశాధికారి పీడీ బి.రూప, పీఈటీలు అంబ్రేస్, రాఘవేందర్, దామోదర్, సౌమ్య, శ్రీలత, మంజుల, ప్రసన్న, అనూష, దివ్య, దేవకమ్మ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి

కోస్గిరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు మంత్రివర్గ ఆమోదం పొందిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షనీయమన్నారు. మంత్రివర్గం ఆమోదించిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో ఏకాభిప్రాయానికి వచ్చి చట్టం తీసుకురావాలని కోరారు. అనంతరం స్వీట్లు పంచి బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో తూం భీంరెడ్డి, వేణుగోపాల్, ఓం ప్రకాష్, నాగులపల్లి నరేందర్, అన్నకిష్టప్ప, తుడుం శ్రీనివాస్, దేవేందర్, హాజీ, యూసుఫ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం 42 శాతం రిజర్వేషన్లను ఆర్డినెన్స్ ద్వారా కల్పించడంపై మండల బీసీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సంఘం నేతలు పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం దగ్గర సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకుముందు కొత్త బస్టాండ్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలయ్య, అశోక్, రవికుమార్, సంజీవ్, మల్లికార్జున్, గోవిందు, చందు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో ఎమ్మార్పీఎస్ సంబరాలు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మద్దూరు: ఎస్సీలకు ఏబీసీడీ వర్గీకరణ జరిగి చట్టబద్ధత పొంది అమల్లోకి వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిక జన్మదినోత్సవం పురస్కరించుకొని మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, జెండావిష్కరణ చేశారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం దాదాపు 30 ఏళ్ల పోరాటం చేసిన వ్యక్తి మంద కృష్ణ మాదిగ అని నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుదాస్, వెంకట్, కృష్ణ, నరేష్, లాలు, పోన్నయ్య, చిన్నయ్య, వారితో పాటు గ్రామానికి చెందిన నాయకులు బాలయ్య, అశోక్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గణపతి దేవాలయ నిర్మాణం చేపడదాం



గణపతి దేవాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వల్లంపల్లి రోడ్డులో ఉన్న శబరి పీఠం దేవాలయ ఆవరణలో భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలోనే గణపతి దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుడతామని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం దేవాలయ నిర్వాహకులు, గురుస్వాములతో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్, సభ్యులు శబరిపీఠం ఆలయ ఆవరణను సందర్శించారు. గణపతి దేవాలయ నిర్మాణానికి కొలతలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన వారిలో గురుస్వాములు కాకర్ల భీమయ్య, అప్పి, జంగిటి వెంకటేష్, బాబు, తిప్పన్న, కృష్ణ, బాలు, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, గోపాల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, హన్మంతు, వై.సంతోష్, శివరాజ్, నర్సింహనాయుడు, ఎం.సంతోష్, నర్సింహ, నాగురావు, అశోక్, కృష్ణ, రాజు ఉన్నారు.

తాగునీటి వసతికి సహకారం

దామరగిద్ద: మండలంలోని ముస్తాపేట్ గ్రామంలో తాగునీటి వసతికి ఆదివారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి గ్రామస్తులకు రూ.15 వేలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ అంజిలయ్యగౌడ్ మాట్లాడుతూ గ్రామంలో గ్రామ పంచాయతీ బోరు నుంచి నీటిని తోడే విద్యుత్ మోటార్ పాడుకావడంతో కొత్త మోటార్‌ను సమకూర్చేందుకు ఫౌండేషన్ చైర్మన్ సహాయం అందించడం అభినందనీయమని వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు ఇటుక ఆసరా



బిజ్వార్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఇటుకలు

ఊట్కూర్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని మండలంలోని బిజ్వార్‌లో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని పోలమ్మ దేవాలయం సమీపంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఇనుప కంచె లేక పోవడంతో చిన్నపిల్లలు, పశువులు ప్రమాదబారిన పడవచ్చని ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కాలంచెల్లిన విద్యుత్ తీగలు బిగించి దానికి ఇటుక పెడ్డలను ఆసరాగా ఉంచి విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఇటుకలు కరిగిన, లేక కింద పడిపోయిన ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్ తీగలు సరిచేయాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి కొత్త విద్యుత్ తీగలు బిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ లైన్‌మెన్ నరేశ్‌ను వివరణ కోరగా కొత్త విద్యుత్ తీగలు బిగిస్తామని తెలిపారు.

నేటినుంచి శ్రీచండీ కుబేర పాశుపత యాగం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, అన్నవజ్జుల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జా భవానీ మందిరంలో ఈనెల 14నుంచి 16 వరకు పంచకుండాత్మక శ్రీచండీ కుబేర పాశుపత యాగం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమై, పాడిపంటలతో విరాజిల్లాలని, రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం దేశంలోనే మంచిపేరు ప్రఖ్యాతలు సాధించాలనే గొప్ప సంకల్పంతో ఈ యాగాన్ని తలపెట్టినట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ యాగంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ధూప, దీప నైవేద్య అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ధూపదీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు రవికుమార్, జిల్లా అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.